# 'మానస' జాలీ ట్రిప్




క్షణం తీరిక లేని ప్రాక్టీసుతో పేషెంట్ల మధ్య పరిమితమైన నా యాంత్రిక జీవితంలో జాలీ ట్రిప్‌గా బొంబాయి బయలు దేరడం నిజంగా గొప్ప ఆటవిడుపు. నాలుగు రోజుల్లో ముగించేద్దామనుకున్న నా ట్రిప్పు అనుకోకుండా మరో నాలుగు రోజులు పొడిగించేసుకున్నాను, మళ్ళీ మళ్ళీ వెళ్ళాలంటే వీలు కుదరదన్న బెంగతోపాటు ముచ్చట గొలిపే సర్వీస్ చేసే ఆ హోటలంటే కలిగిన అనుభూతి.

బెల్లు కొడితే బోయ్. స్విచ్చి నొక్కితే బోయ్, కనీసం మంచం మీదనుంచి లేవకుండా పక్కనే ఉన్న బజర్ మీద చెయ్యేస్తే చాలు—బోయ్! రైటింగ్ టేబిల్ మీద రాసుకుంటూంటే లేవక్కర్లేదు కాలి కింద బటన్ నొక్కితే చాలు, బాత్ రూమ్‌లో ఉన్నా ఇబ్బంది లేదు. వాష్ బేసిన్ పక్కనే ఏర్పాటుంది. మొత్తానికి ఎక్కడనుంచి ఆర్డరు వేసినా.,. అల్లాఉద్దీన్ అద్భుతదీపంలో రాక్షసుళ్ళా ప్రత్యక్షమై పోతాడు చిరునవ్వుతో బోయ్.

పూర్తి మొజాయిక్ ఫ్లోరింగ్‌తో, ఎక్కడికక్కడ ఎలక్ట్రిక్ స్విచ్చిలు పెట్టి— పడుకున్నా, కూర్చున్నా, వరండాలో నిలుచున్నా గదంతా దేదీప్యమానం చేసుకోవడానికీ, అవసరం లేనిలైట్లన్నీ ఫాన్లనీ తీసేసుకోవడానికీ ఎన్నెన్నో ఏర్పాట్లు. విశాలమైన ఆ గదిలో మూడు నాలుగు చోట్ల ఫోను సౌకర్యం, ఆఖరికి బాత్‌రూమ్‌లోకూడా.

తలుపు తియ్యడానికికూడా లేవక్కర్లేదు, స్విచ్ నొక్కితే చాలు తెరుచుకుంటుంది. మన అనుమతి పొంది గదిలోకొచ్చి తుడిచి శుభ్రం చేసే స్వీపర్ల మీద అజమాయిషీ చేసే సూపర్‌వైజర్ ఏర్పాట్లెలా ఉన్నాయనొచ్చి అడుగుతాడు. 'ఏదైనా లోపం ఉందా దయచేసి చెప్పండి' అని సవినయంగా అర్థిస్తాడు మరొకడు. బెల్లునొక్కి పేపర్ అంటే చాలు, భారతదేశంలో ఉన్న ప్రముఖ వారపత్రికలన్నీ వచ్చేస్తాయి. డబ్బు పోతే పోయింది, మళ్ళీ కావాలనుకుంటే మాత్రం ఇలాంటి సుఖం వస్తుందా అందుకే పెంచేశాను ట్రిప్పు మరో నాలుగు రోజులు.

ఫ్లోరు సూపర్‌వైజరట—నేను రోజూ బయటికెళ్ళే టైమ్‌కొస్తాడు. ఏ పూటా కా పూట వెళ్ళి పోతానేమో నని అతగాడి ఆరాటం కాబోలు. 'ఏమైనా సజెషన్లూ కంప్లైంట్లూ ఉంటే రాయండి సార్ పుస్తకంలో' అంటూ చేతులు కట్టుకుని నిలుచుంటాడు. 'ఇంతకు మించి ఇంకా ఏం సౌకర్యాలు కావాలో నాకు తెలీటం లేదు. పోనీ కంప్లైంటేదైనా రాద్దామంటే. అందుకు అవకాశమే లేదు కదా' నవ్వుతూ అంటాను.

'పోనీ మా హోటల్ మీద తమ అభిప్రాయం అన్నా రాయండి సార్' అంటాడు ప్రాధేయ పడుతున్నట్టు.

'వెళ్ళేటప్పుడు రాస్తానులే. నవ్వుతూపంపించేస్తా నతగాడ్ని. బొంబాయి లాంటి మహా నగరంలో కావాలని ట్రిప్పు పెంచు కోవడానికి దోహదం చేసిన ఆ హోటల్ విశిష్టతని మెచ్చుకుంటూ నా పరంగా నేను పొందిన అనుభూతిని రాద్దామనే అనుకున్నాను వెళ్ళే రోజున.

రోజూ బయటికెళుతూ తాళంచెవి రిసెప్షన్‌లో ఇచ్చేసి వెళ్ళేవాడ్ని. సాయంత్రం నే నొచ్చే వేళకి

చిరునవ్వుల అందించే వాళ్ళది నాకు మళ్ళీ.

ఆ రోజు అలవాటు ప్రకారం తాళం తీసుకున్నాను.

ఐదో అంతస్తులో ఉన్న నా రూమ్ లోకి వెళ్ళ డానికి ఐదు క్షణాలుకూడా పట్టదు. ఎట్ యువర్ సర్వీస్‌లా ఎదురు చూస్తుంటాడు లిఫ్టు బోయ్. కనీసం ఒక అర డజనన్నా లిఫ్టు లున్నాయి కాబట్టి వెయిటింగ్ బిజినెస్సే ఉండదు.

రోజు లాగానే లిఫ్టులో వెళ్ళి, ఐదో అంతస్తులో దిగి వడివడిగా నడిచి రూమ్ తలుపు తియ్య బోయాను.

రాలేదు.

తాళం అటూ ఇటూ తిప్పాను. తిరగడం లేదు. బోయ్‌ని పిలుద్దామంటే స్విచ్ లోపల ఉంది. అయినా బయట ఉన్న స్విచ్ నొక్కాను. వార్డ్ సూపర్‌వైజర్ వచ్చాడు. పరిస్థితి గమనించి, 'నేను తాళాన్ని ఒక్క క్షణంలో తీస్తాను సార్' అని ఒకటికి రెండు సార్లు ప్రయత్నించి విఫల మయ్యాడు. ఇబ్బందికి నన్ను క్షమించమని కోరుతూ గభాలున పక్కనే ఉన్న ఇంటర్ కమ్‌లో రిసెప్షన్‌కి ఫోను చేసి ఫ్లోర్‌లో ఉన్న బోయ్‌ని పిలిపించాడు. తాళం మారిందని. క్షణాల మీద పరిగెత్తి కెళ్ళాడు బోయ్. ఐదు నిమిషాల్లో వచ్చాడు మరో తాళం తీసుకుని. మళ్ళీ ప్రయత్నించాడు సూపర్‌వైజర్. లాభంలేకపోయింది తాళం తిరగలేదు. మళ్ళీ రిసెప్షన్‌కి ఫోను చేశాడు. తాళం పుచ్చుకుని మళ్ళీ పరిగెత్తాడు బోయ్. గోడకి కొట్టిన బంతిలా క్షణాల మీద తిరిగొచ్చాడు మరో తాళంతో. ఆత్రంగా సూపర్‌వైజర్ మళ్ళీ ప్రయత్నించినా అదే ఫలితం తలుపు రాలేదు.

ఈసారి ఇంకేదో చెప్పి పంపాడు బోయ్‌ని. బాణంలా దూసుకుపోయా డతగాడు!

ఉదయం నుంచీ తిరిగి తిరిగి వస్తున్నానేమో ఒళ్ళంతా అలసటగా ఉంది. చెమట పట్టిన మొహాన్ని నిట్టూరుస్తూ తుడుచుకుంటున్న నాలో అసహనం చోటు చేసుకుంటూందన్న అనుమానం తగిల్నట్టుంది. విపరీతంగా క్షమాపణలు చెప్పు కుంటున్నాడు సూపర్‌వైజర్... లాంజులో ఉన్న సోఫాలో కూర్చోమని ప్రతిమాలుస్తూ...!

పరవాలేదన్నట్టు చూశాను.

[illegible] వెళ్ళిన బోయ్ ఇంకా రాలేదు. సూపర్‌వైజర్ గుమ్మం దగ్గిరే ఉండిపోయాడు. ఇంకే మాత్రం ఓపిక లేక నెమ్మదిగా నడిచాను లాంజ వైపు. కాఫీ త్రాగాలనిపించింది. గబాల్న అక్కడున్న ఫోను తీసి ఫోన్జేశాను రిసెప్షన్‌కి. కాఫీ పంపమని. ఫలానా రూమ్‌లో బసజేసే వ్యక్తిని మాట్లాడుతున్నానని నే చెప్పేసరికి...క్షణాల మీద క్షమాపణల స్తోత్రం వినిపించసాగింది అట్నుంచి. నవ్వొచ్చింది నాకు వాళ్ళ ఆదుర్దా, గాబరా. ఎటెన్షన్ చూస్తుంటే!

తాళం [illegible] చెడిందని హోటల్ మెకానిక్కుని తీసుకుని మేనేజర్ వస్తున్నాడని ఫోన్లో రిసెప్షనిస్ట్ చెప్పేసరికి నిజంగా సిగ్గేసింది నాకు.

ఫోను పెట్టేసి ప్రక్కకు తిరిగానో లేదో... "మీకు కలిగిన ఇబ్బందికి చాలా బాధపడుతున్నాను. క్షమించాలి! ఒక్క రెండు నిముషాల్లో తలుపు తెరిచేస్తాడు మా మెకానిక్కు..." నొచ్చుకుంటూ అభ్యర్థించాడు మేనేజర్ లిఫ్టులోంచి దిగీదిగంగానే నా రెండు చేతులూ పుచ్చుకుని. మెకానిక్కు పరిగెత్తుకుంటూ వెళ్ళాడు తలుపు దగ్గరికి.

'పరవాలేదు లెండి, ఒక్కొక్కప్పుడలాంటి బ్రేక్ డవున్స్ వస్తుంటాయి—' నవ్వుతూ అన్నాను.

"మేమెంత జాగ్రత్తగా తీసుకోగలిగినా... మా లోపం లోపమే సార్!" మేనేజర్ గొంతులో బాధ స్పష్టంగా స్ఫురించింది.

"ప్లీజ్ డోంట్ వర్రీ! మీరు చెయ్యాల్సిన దానికి మించి చేస్తున్నారు—నాకు చాలా ఆనందంగా ఉంది" చిరునవ్వు నవ్వాను.

ఇంతలో కాఫీ వచ్చింది.

ట్రేలోంచి కెటిల్ తీసి కాఫీ స్వయంగా కలిపి ఇస్తూ... "కాఫీ తీసుకుంటూ ఉండండి సార్! మీరు త్రాగేలోగా తలుపు తెరిచేస్తారు మావాళ్ళు" అన్నాడు మేనేజర్.

"మళ్ళీ చెబుతున్నాను. టేక్ థింగ్స్ ఈజీ సార్— మీ ఆదుర్దా, ఎటెంషన్ చూస్తుంటే... నాకెంతో సిగ్గేస్తుంది కూడా" అన్నాను కాఫీ సిప్ చేస్తూ!

నా మాటకి మేనేజర్ చిన్న చిరునవ్వు నవ్వి.. గబాల్న ఫోనెత్తి ఇంటర్‌కమ్‌లో మాట్లాడాడు కాఫీ బిల్లు నాకు వెయ్యొద్దని.., నేనెంత చెబుతున్నా వినకుండా... మీకు కలిగించిన అసౌకర్యం ముందు ఒక కాఫీ ఎంతండీ? [illegible] అంటూ!

మెకానిక్కు తాళం బాగుచేసి తలుపు తెరిచాడు.

మరోసారి క్షమాపణలు చెప్పుకుని వెళ్ళిపోయాడు మేనేజర్. రూమ్‌లోకి వెళ్ళి చొక్కా విప్పుకుంటూ బెల్లు నొక్కాను సిగరెట్లకోసం...!

స్విచ్ వేస్తే వెలిగినట్టు పరిగెత్తుకొచ్చాడు బోయ్. మామూలుగా కాక, రొప్పుతూ కనపడ్డ బోయ్, 'ఏం కావాలి సార్' అని ప్రతిసారి అడిగేట్టు అడగలేదు. ఆ ప్రయత్నం చేస్తూ... చేస్తూ, రొప్పుతూ... దగ్గుతూ.., ఆత్రంగా నావైపు చూస్తూ సైగ చేస్తున్నాడు?— ఏం కావాలో చెప్పండి క్షణంలో చేస్తానన్నట్టు.

ఒక్క క్షణం ఆగాను. ఇంకో క్షణమాగి 'ఏం లేదు. ఒక్క నిముషము ఉండు' అన్నాను. అలా ఉండిపోయాడు బోయ్. ఓ నిమిషం తరవాత రొప్పడం కాస్త తగ్గినట్టుంది, చేతులు కట్టుకుని 'సార్' అన్నాడు నెమ్మదిగా నవ్వుతూ!

'ఏం లేదు. సిగరెట్లు కావాలి—ఓ పాకెట్ రెడ్ విల్స్ తీసుకొస్తావా?"అంటూ ఓ ఐదునోటు వాడి చేతిలో పెట్టి 'ఏం? ఎందుకలా రొప్పుతున్నావు బోయ్?" అన్నాను.

"ఏం లేదు సార్—రోజూ ఉండేదే' లేని నవ్వు తెచ్చి పెట్టుకుంటూ అన్నాడు.

"రోజూ ఉండేదేమిటి, ఏదైనా సుస్తీయా..?"

"కాదు సార్! అదంతే సార్—"

"డొంక తిరుగుడు వేషాలెయ్యకు. ఏదైనా జబ్బయితే చెప్పు! నేను డాక్టర్ని, మందిస్తాను!"

"అదేం లక్కర్లేదు సార్. ఐదో అంతస్తు నుంచి పరుగు మీద మూడు నాలుగు సార్లు గబ గబా ఎక్కి దిగాను. కదా.., అందుకని. అయినా రోజూ అది మాకు అలవాటే సార్!"

"ఏం లిఫ్ట్లన్నీ బిజీగా ఉన్నాయా?

"మా అలవాటే సార్.".. నవ్వాడు మళ్ళీ!

"ఏం అలవాటు..? రోజూ ఒక వందసార్లిలా మెట్లెక్కి దిగితే.. చస్తావు! ఆలస్యం అయితే అయింది.. లిఫ్ట్ కాళీగా ఉండేదాకా ఆగకూడదా..? అన్నాను కాస్త చిరుకోపం ప్రదర్శిస్తూ..!"

"కాళీగా ఉన్నా రూం బాయ్‌లు లిఫ్ట్ లెక్క కూడదు సార్!"

"ఏం..?"

"ఈ హోటల్ రూల్సంతే సార్! బాయ్‌లు పొర పాటున కూడా లిఫ్టెక్కకూడదు సార్! ఎన్నిసార్లైనా మెట్లెక్కి దిగాల్సిందే సార్!" అతి సాధారణంగా చెబుతున్నాడు బాయ్!

ఎంత క్రూరం..? ఎవరో మనసు పిండేసి నట్టైంది...!

"సర్లే, సిగరెట్లున్నాయిలే అలాగా అవసరం అయితే నే క్రింద కెళ్ళినప్పుడు తెచ్చుకుంటాన్లే!" గబాల్న అనేశాను.

"పరవాలేదు సార్.. రెండు నిమిషాల్లో తెచ్చేస్తానుగా!" అంటూ క్షణంలో పరిగెత్తాడు బోయ్

వాడొచ్చే లోపల నా బుర్ర తిరిగినట్టనిపించింది. కనీసం రోజుకి పదిహేను సార్లైనా వాణ్ని క్రిందికి పంపిస్తుంటారు. దారుణం! పాపం వాడు ఐదంతస్తులు దిగి.. మళ్ళీ ఎక్కాలన్నమాట— ఇలా ఎన్ని రూముల్లో వీడి సపర్యలు..?

* * * *

మర్నాడు కంప్లైంట్స్ సార్, సజెషన్స్ సార్... అంటూ వచ్చిన వాణ్ని ఐదు నిమిషాలాపేశాను గదిలో. పుస్తకం నాకిచ్చి అలా నిల్చున్నా డతగాడు.

"మీ హోటల్లో సదుపాయాలన్నీ చాలా బాగున్నాయి. మీ సేవలపూర్వం! ఎప్పుడు బొంబాయి వచ్చినా మళ్ళీ మళ్ళీ మీ హోటల్ నే దిగాలన్న అను భూతి కలుగుతుంది. ఒక్కటే' అని రాస్తూ రాస్తూ, రూమ్ బోయిల్ని లిఫ్ట్లో తిరగనివ్వండి. మానవతా వాదానికి అత్యంత విలువనిచ్చిన వాళ్ళవుతారు' అని రాసేశాను కడుపుమండి చివర్లో...!

బెజవాడకి తిరిగి ప్రయాణమవుతూ.. వీ.టి। స్టేషన్లో రైలెక్కుతూంటే.. ప్లాట్ ఫారం మీద కనపడ్డాడు రూమ్ బాయ్. గబాల్న బుజం తట్టి పిలిచి.. 'నేనిందాక రూము కాళీ చేసేటప్పుడు నువ్వు డ్యూటీలో లేవుట.. ఉంచు ఈ బక్షీష్" అంటూ ఓ ఐదు వాడి చేతిలో పెట్టాను.

కృతజ్ఞతగా చూశాడు బాయ్..!

"నువ్వు ఊరెళ్తున్నావా, ఎంతదాకా ప్రయాణం...?" అన్నాను.

"పూనా వెళ్తున్నాను సార్!"అన్నాడు బాయ్.

"మీ ఊరదా..?"

"కాదు సార్, ఉద్యోగం కోసం...!"

"ఏం ఉన్నచోట మానేశావా?"

"లేదు సార్, తీసేశారు..!"

"ఎందుకూ..?"

"రూంబోయిల విషయంలో హోటలు పద్ధతు లన్నీ పాసింజర్లకు చెప్పి.. మా హోటల్ పరువు తీసేస్తున్నానుట. ఆ మాటే చెప్పి ఉన్న ట్టుండి మధ్యాహ్నం నుంచీ పన్లోంచి తీసేశారు సార్..!"

ప్లాట్ ఫారం మీద నిల్చునే ఉన్నాను., రైలు కదిలి పోతున్నట్టనిపించింది.!!!! *